క్లుప్తంగా

పంచాయతీల వారీగా యూరియా పంపిణీ

గూడూరు: యూరియా కోసం రైతులు ఆందోళన చెందరాదని మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, ఏఓ అబ్దుల్‌మాలిక్ అన్నారు. గూడూరు శివారు వడ్డెరగూడెం రైతు వేదికలో శనివారం మండల పంచాయతీ కార్యదర్శులు, ఏఈఓలు, పీఏసీఎస్ సిబ్బందితో యూరియా పంపిణీపై సమావేశం నిర్వహించారు. ఇకనుంచి యూరియా పంపిణీ మండలంలోని 5క్లస్టర్ల ద్వారా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. తహసీల్దార్ నాగభవాని, ఎంపీడీఓ సత్యనారాయణ, ఎస్సై గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

బయ్యారం: మండలంలో ఏర్పాటు చేసిన నాలుగు క్లస్టర్ల పరిధిలో ఇక నుంచి రెవెన్యూ గ్రామాల వారీగా యూరియా పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి రాంజీ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి పాల్గొన్నారు.

స్ఫూర్తి పురస్కార్ అవార్డు అందజేత

నెల్లికుదురు: స్ఫూర్తి పురస్కార్ అవార్డుకు మండలంలోని శ్రీరాగిరి గ్రామానికి చెందిన ఆదూరి కళాధర్ రాజు, బొమ్మిడి వినోద్‌రెడ్డి ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని కింగ్‌కోటిలో గల వైఎంసీఏ హాలులో వీరికి అవార్డును అందజేశారు. అంతరించిపోతున్న కళలకు ప్రాణం పోస్తూ గురువులను తయారు చేస్తున్నందుకు ఎంపికయ్యారు.

అక్రమ నిర్మాణాన్ని పట్టించుకోని అధికారులు

దంతాలపల్లి: మండలంలోని బీరిశెట్టి గూడెం గ్రామంలో అక్రమ నిర్మాణాన్ని సంబంధిత అధికారులు ఆపలేకపోయారని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామంలోని రోడ్డును ఓ వ్యక్తి ఆక్రమించి ఇంటినిర్మాణం చేస్తున్నాడని పలుమార్లు ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సోమారపు లింగయ్య, జిల్లా అధ్యక్షుడు చాగంటి రమేశ్ పాల్గొన్నారు.

ప్రతిభను ప్రోత్సహిస్తాం..

డోర్నకల్: చదువుల్లో రాణించి ప్రతిభ కనబర్చిన పేద విద్యార్థులను ప్రోత్సహిస్తామని డోర్నకల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కందుల నరేష్ తెలిపారు. స్థానిక బ్రిలియంట్ హైస్కూల్‌లో గత సంవత్సరం 10వ తరగతిలో టాపర్‌గా నిలిచిన జాలా దర్శికకు రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో గోపాల్ వర్మ, యశోధర్‌జైన్, వెంకటేశ్వర్లు, హెచ్ఎం అప్సరాబేగం పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

కొత్తగూడ: ఉమ్మడి కొత్తగూడ మండల జేసీబీ యజమానుల మండల కమిటీ ఎన్నిక మండల కేంద్రంలో శనివారం ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా ఎస్‌కె.యాకూబ్‌పాష, ఉపాధ్యక్షుడిగా రమేష్, ప్రధాన కార్యదర్శిగా కూనూరు అశోక్, సహాయ కార్యదర్శిగా రవి, కోశాధికారిగా రాము, కార్యవర్గ సభ్యులుగా మహేందర్, శ్రీరాములు, శంకర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

దస్ లక్షణ్‌పర్వ్ పూజలు

గార్ల: దస్‌లక్షణ్‌పర్వ్ పండుగను పురస్కరించుకొని జైనుల ఆరాధ్యదైవం మహవీర్ భగవాన్‌కు స్థానిక జైన్ మందిరంలో జైన్ గురువు ఆధ్వర్యంలో ప్రత్యేక శాంతి అభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు. 10రోజుల పాటు జరిగిన ఈ పూజల్లో జైనులు కఠినమైన నియమాలతో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జైనులు విజయ్, మహవీర్, మహేందర్, వినోద్, విపుల్, ఆకాష్, దిలీప్, సంకేత్, సంజీల్, నవీన్, ప్రవీణ్, విమల్, అజయ్, సంకేత్, మహిళా జైనులు పాల్గొన్నారు.

నియామక పత్రాల అందజేత

నెల్లికుదురు: గత ప్రభుత్వం వీఆర్‌ఓ, వీఆర్‌ఏ వ్యవస్థను రద్దు చేసి ఇతర శాఖల్లో సర్దుబాటు చేసిన విషయం తెలిసిందే. భూ సమస్యలతో పాటు గ్రామంలో ఇతర సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం జీపీఓ వ్యవస్థను తీసుకొచ్చింది. ఇతర శాఖల్లో పనిచేస్తున్న వీఆర్‌ఓ, వీఆర్‌ఏలను జీపీఓలుగా చేరేందుకు అవకాశం కల్పించింది. దీంతో జీపీఓలుగా హైదరాబాద్‌లో మహబూబాబాద్ అడిషనల్ కలెక్టర్ అనిల్ కుమార్ చేతుల మీదుగా మండలాలకు చెందిన జీపీఓలు నియామక పత్రాలను అందుకున్నారు.

పల్లెల్లో 'పంచాయతీ' సందడి..!

- సెప్టెంబర్‌లోగా ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు సూచన
- నిర్వహణపై ప్రభుత్వ కేబినెట్ సమావేశాలు
- ఎదురుచూస్తున్న ఆశావహులు


గూడూరు మండల పరిషత్ కార్యాలయం

గూడూరు: ఇటీవల హైకోర్టు పంచాయతీ ఎన్నికలను సెప్టెంబర్‌లోగా రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. దీనికి అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం సైతం ఎన్నికల నిర్వహణకు కార్యాచరణ ప్రారంభించింది. దీంతో ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీలో ఉండాలనుకుంటున్న ఆశావహులు ఎదురుచూస్తూ ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఎన్నికల నిర్వహణపై కేబినెట్, ఇతర సమావేశాలు నిర్వహించడంతో దాదాపుగా ఎన్నికలు నిర్వహిస్తారనే ఆశావహులు భావిస్తూ అందుకు తగ్గ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలపై పల్లెల్లో సందడి నెలకొనగా, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఎన్నికలకు ముందుకు సాగుదామా.. రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న యూరియా కొరతతో, దెబ్బ పడుతుందా అనే సందిగ్ధంలో ఆలోచనలు చేస్తున్నారు.

స్థానిక ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామపంచాయతీల వారిగా తుది ఓటర్ల జాబితాను ఖరారు చేశారు. ఈనెల 2న సంబంధిత గ్రామపంచాయతీల వద్ద అధికారులు ఓటర్ల జాబితాను ప్రదర్శించారు. మండలంలో మొత్తం 41 గ్రామపంచాయతీలు ఉండగా, మొత్తం 48,570 మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 23,851, మహిళలు 24,717 మంది, ఇతరులు 2ఉన్నారు. మండలంలో 17ఎంపీటీసీ, 1 జెడ్పీటీసీ, పంచాయతీ వార్డులు 354, పంచాయతీల్లో పోలింగ్ కేంద్రాలు 354 ఉన్నాయి.

పల్లెల్లో స్థానిక ఎన్నికలపై చర్చ

హైకోర్టు సూచన, రాష్ట్ర ప్రభుత్వ ప్రకటనతో దాదాపుగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తారనే ప్రచారం గ్రామాల్లో జోరుగా సాగుతుంది. దీనికి తోడు ఇటీవల అధికారులు డ్రాఫ్ట్ ఓటరు జాబితాను సైతం విడుదల చేశారు. దీంతో ఎక్కడ చూసినా గ్రామాల్లో ఎన్నికలపై చర్చ మొదలైంది. రిజర్వేషన్లపై ఇంకా స్పష్టత లేకపోవడంతో ఆశావహులు తమ కేడర్‌తో మంతనాలు జరుపుతున్నారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చింది. రిజర్వేషన్ల మీద క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ క్రమంలో హైకోర్టు ఆదేశాలతో గతంలో ఉన్న రిజర్వేషన్ల మేరకే ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయనే ప్రచారం కూడా సాగుతుంది. ఏది ఏమైనా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్న కొత్త ఆశావహులు మాత్రం రాబోయే బతుకమ్మ, సద్దులు, దసరా, దీపావళి పండుగలకు పెట్టాల్సిన ఖర్చులపై కూడా ఆలోచనలో పడ్డారనేది చర్చనీయాంశంగా మారింది.

యూరియా కొరతను సృష్టించింది కాంగ్రెస్సే

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభూ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

మహబూబాబాద్ అర్బన్: రాష్ట్రంలో యూరియాను కృత్రిమ కొరతను సృష్టిస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వమే అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభూ వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా అవసరమైన యూరియాను పంపిణీ చేస్తుందని, మన రాష్ట్రంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం బ్లాక్ మార్కెట్‌ను అడ్డుకోలేకపోతుందన్నారు. దీంతో రైతులు యూరియా దొరకక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉమ్మడి జిల్లాకు 2,607 మెట్రిక్ టన్నుల యూరియా చేరుకుందని, మానుకోట జిల్లాకు 450మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించారన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు మహేష్, అశోక్ కుమార్, మదన్, జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, పద్మ, జిల్లా కార్యదర్శి సతీష్, నాయకులు హిందుభారతి, సందీప్, అశోక్, కాంతమ్మ పాల్గొన్నారు.

స్వామినాథన్ సిఫారసులను అమలు చేయాలి



కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న సక్రు

గార్ల: వ్యవసాయ రంగంలో స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేసి రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు జి.సక్రు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని గోపాలపురంలో జరిగిన రైతు సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. పత్తి క్వింటాకు రూ.10,075 చెల్లించాలన్నారు. అదే విధంగా రాష్ట్రంలో యూరియా సంక్షోభాన్ని నివారించి బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. కార్యక్రమంలో గోళ్ల మాధవరావు, వెంకన్న, సీహెచ్ గణేష్, శంకర్, కొండయ్య, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులతో ఉజ్వల భవిష్యత్


మాట్లాడుతున్న సుగుణాకర్‌రాజు

తొర్రూరు: వృత్తి విద్యా కోర్సులతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తొర్రూరు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పగిడిపాటి సుగుణాకర్‌రాజు అన్నారు. డివిజన్ కేంద్రంలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో శనివారం వెంకటేశ్వర ఒకేషనల్ జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ జాటోతు రమేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డాక్టర్ సుగుణాకర్‌రాజు మాట్లాడారు. ఆసక్తి ఉంటే హెల్త్ కేర్ రంగంలో అద్భుత అవకాశాలు ఉంటాయన్నారు. వైద్యరంగంలో డాక్టర్లకు అనుసంధానంగా పనిచేసే సాంకేతిక, సహాయ సిబ్బంది అవసరం ఎంతో ఉందని పేర్కొన్నారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.అశోక్, డైరెక్టర్లు భూక్య శ్రీను, మచ్చ సాగర్, యాదగిరి నాయక్, అధ్యాపకులు బందు సంధ్య, విజయ, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కేసముద్రం: ద్విచక్రవాహనాన్ని, బొలేరో వాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలైన సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని ఫ్లైఓవర్ బ్రిడ్జిపై శనివారం చోటుచేసుకుంది. మండలంలోని ధన్నసరి గ్రామానికి చెందిన కటకం హరిప్రసాద్, శంకర్ లింగం అనే ఇద్దరు వ్యక్తులు బైక్‌పై స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి పని నిమిత్తం వచ్చి, తిరిగి వెళ్తుండగా, ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఎదురుగా వస్తున్న బొలేరో వాహనం ప్రమాదవశాత్తు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు క్షతగాత్రులను 108లో మానుకోట జనరల్ ఆసుపత్రికి తరలించారు.

ఓటరు జాబితా ప్రదర్శన

నెల్లికుదురు: మండలంలోని వివధ గ్రామాలల్లో ఎంపీటీసీ స్థానాలు, పోలింగ్ భూతుల వారీగా ఓటరు జాబితా ఆయా గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించినట్లు ఎంపీడీఓ సింగారపు కుమార్ తెలిపారు. శనివారం ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండలంలోని వివిధ గ్రామాలల్లో 13ఎంపీటీసీ స్థానాలకు మొత్తం ఓట్లు పురుషులు 20019, మహిళలు 20451 అదర్స్ 1 మొత్తం 40471 ఓటర్ల జాబితాను ఆయా గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించినట్లు తెలిపారు. ఈనెల 8న ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాలపై గుర్తింపు పొందిన అన్ని పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులతో ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

డోర్నకల్: ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల ముసాయిదా జాబితాను శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని నోటీస్ బోర్డులో ప్రదర్శించారు. మండలంలోని 10 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించిన ఓటర్ల వివరాలతో పాటు పోలింగ్ బూతుల వివరాలను నోటీస్ బోర్డులో అందుబాటులో ఉంచారు.

అభివృద్ధికి ఆకర్షితులై కాంగ్రెస్‌లోకి..


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాంరెడ్డి

చిన్నగూడూరు: అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్ గూటికి చేరుతున్నారని డోర్నకల్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గునిగంటి కమలాకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మరిపెడ పీఏసీఎస్ మాజీ చైర్మన్ రావుల రాంరెడ్డి నివాసంలో మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు దాసరి రాజు ఆధ్వర్యంలో మండలంలోని ఉగ్గంపల్లి గ్రామానికి చెందిన ఇరవై కుటుంబాలు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మారబోయిన వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి పట్ల రవికిరణ్, ఉగ్గంపల్లి గ్రామ అధ్యక్షుడు గండ్ల భద్రయ్య, మండల నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయులపైనే


మహబూబాబాద్ అర్బన్: సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు


గూడూరులో..


పెద్దవంగర: సన్మానం పొందిన ఉత్తమ ఉపాధ్యాయులు

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థుల భవిష్యత్ తరగతి గదిలో రూపుదిద్దుకుంటుందని, సమాజాన్ని ప్రగతివైపు నడిపించే శక్తి కేవలం ఉపాధ్యాయులకే ఉంటుందని ఏసీజీఈ మందుల శ్రీరాములు అన్నారు. ఉపాధ్యాయుల దినోత్సవం పురస్కరించుకొని జేడీ్పీ కార్యాలయంలో శనివారం మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ శీలం వెంకటేశ్వర్లు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు వెంకటేశ్వర్లు, గిరిజ, సిరినాయక్, కోట్యా నాయక్, సమ్మెట వెంకటేశ్వర్లు, రాంజీనాయక్ పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర కీలకం

పెద్దవంగర: మండల కేంద్రంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన గెజిటెడ్ హెచ్‌ఎం కళాధర్, హెచ్‌ఎంలు సత్యనారాయణ, రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయులు రాజలింగం, రమేష్ బాబు, వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, సురేష్, బాలరాజు, ప్రణతి, సైదమ్మ, సీఆర్పీ సంతోష్‌లను లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ బుదారపు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గురువు దైవంతో సమానం

గూడూరు: విద్యనేర్పే గురువు దైవంతో సమానమని, ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైందని ఎంపీడీఓ అడ్డగట్ల సత్యనారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన 32మందిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ జె.రవికుమార్, ఎస్టీవో రఫీ పాల్గొన్నారు.

వేలంలో లడ్డూ దక్కించుకున్న భక్తులు


గార్లలో..


మరిపెడలో..


మహబూబాబాద్ అర్బన: జమాండ్లపల్లిలో..

గార్ల: మండలంలోని రాజుతండా ఎర్రమట్టితండాలో ప్రతిష్ఠించిన గణనాథుడి లడ్డూ వేలంపాటలో భూక్యా హరియా రూ.1,59,001లకు పాటపాడి దక్కించుకున్నాడు.

రూ.రూ.60వేలకు..

మరిపెడ రూరల్: మండల కేంద్రంలోని ఆర్ఎస్ ప్లాజా వీధిలోని గణేషుడి లడ్డూను ప్రింటింగ్ ప్రెస్ కరుణాకర్ రెడ్డి రూ.60,116లకు దక్కించుకోగా, రెండో లడ్డూను రావుల సుమంత్‌రెడ్డి రూ.50,116 దక్కించుకున్నాడు.

రూ.20,501లకు..

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మహాగణపతి నిమజ్జనం సందర్భంగా శనివారం వైభవంగా గణేష్ స్వామి వారి లడ్డూను వేలం పాటలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్ గౌడ్ రూ. 20,501తో స్వాధీనం చేసుకున్నారు.

విజయవంతం చేయాలి

నెహ్రూసెంటర్: ఈనెల 9వ తేదీన సేవాలాల్ సేన ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావత్ వెంకన్ననాయక్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో సంఘ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలాలు, గ్రామాల్లో జెండాలు ఆవిష్కరించి ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. ఈ సమావేశంలో నందులాల్‌నాయక్, మాలోత్ సురేష్, రాంబాబునాయక్, సుమన్‌నాయక్, భూక్య నరేష్‌నాయక్ పాల్గొన్నారు.

కుట్రలు మానుకోవాలి

తొర్రూరు: లంబాడ సామాజికవర్గానికి ఎస్టీ రిజర్వేషన్ తొలగించాలనే కుట్రలు మానుకోవాలని ఎల్-జేఏసీ ఉమ్మడి జిల్లా కోకన్వీనర్ ధరావత్ కిషన్ నాయక్ అన్నారు. డివిజన్ కేంద్రంలోని విశ్రాంతిభవనంలో శనివారం లంబాడ జేఏసీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈనెల 9న లంబాడ ప్రజలతో హన్మకొండలో శాంతిర్యాలీ, సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జాటోతు బాలు నాయక్, ధరావత్ జైసింగ్, కాలునాయక్, జాటోతు స్వామి నాయక్, యాదగిరినాయక్ పాల్గొన్నారు.

ముగిసిన నిమజ్జనం


మహబూబాబాద్ రూరల్: గోమయ గణపతి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు


డోర్నకల్‌లో వినాయకుడి శోభాయాత్ర


గార్ల: ఊరేగింపుతో వెళ్తున్న నిర్వాహకులు


మరిపెడ పట్టణంలో..

పలు గ్రామాల్లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాల నిమజ్జనం శనివారం ముగిసింది. విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి వాగులు, చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు, మహిళలు, యువకులు నృత్యాలు చేశారు.

\- సాక్షి నెట్‌వర్క్

రహదారిపై రైతుల రాస్తారోకో


రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

గూడూరు: మండల కేంద్రంలోని ప్రధాన బస్టాండ్ సెంటర్ జాతీయ రహదారిపై శనివారం రైతులు యూరియా కోసం రాస్తారోకో నిర్వహించారు. స్థానిక ఓ ఫర్టిలైజర్ షాపుకు ఒక లారీ లోడ్ యూరియా వచ్చిందన్న విషయం తెల్సుకున్న రైతులు తెల్లవారు జామునే షాపు వద్ద క్యూ కట్టారు. షాపు యజమాని తనకు వచ్చిన బస్తాలను రైతులకు పంపిణీ చేశారు. దీంతో బస్తాలు అందని రైతులు నినాదాలు చేస్తూ ఎన్‌హెచ్‌పై రాస్తారోకో చేశారు. విషయం తెల్సుకున్న సీఐ సూర్యప్రకాష్ రైతులకు నచ్చజెప్పి ఆందోళన విరమింజజేశారు. గంటపాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

నిరసనలు.. పడిగాపులు..


దంతాలపల్లి: యూరియా కోసం క్యూలో రైతులు


నెల్లికుదురు: అస్వస్థతకు గురైన రైతు భూక్య రమేశ్


నెల్లికుదురు: కూపన్ల కోసం రైతువేదికలోకి దూసుకువచ్చిన వందలాది రైతులు

నిద్రహారాలు మాని రోజంతా యూరియా బస్తాల కోసం రైతులు అదే నిరసన.. అదే పడిగాపులు తప్పడంలేదు. అయినా ఒక్క బస్తా కూడా దొరకడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శనివారం కూడా రైతులు యూరియా కోసం క్యూలో నిలబడి ఇబ్బందులు పడ్డారు.

\- సాక్షి నెట్‌వర్క్

ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే నాణ్యమైన విద్య

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే నాణ్యమైన విద్యా అందుతుందని ఎంఈఓ శీలం వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని జేడీహెచ్ఎస్ బాలికల పాఠశాలో శనివారం వైఎంసీఏ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలలో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో వైఎంసీఏ సెక్రటరీ బొడ్డు సుధాకర్, హెచ్ఎం ఆరుద్ర వెంకటేశ్వర్లు, ఉత్తమ ఉపాధ్యాయులు శంకుతల, ఫాతీమ, భిక్షం, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ బుక్స్ పంపిణీ

మహబూబాబాద్ రూరల్: స్ఫూర్తి ఎడ్యుకేషన్ ఫౌండేషన్ తెలుగు సేవా సమితి ఆఫ్ నేబ్రాస్క ఆధ్వర్యంలో మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్ఎంఎంఎస్ రాస్తున్న 8వ తరగతి విద్యార్థులకు పుస్తకాలను శనివారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.గిరిజ, ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణయ్య, వ్యవస్థాపక అధ్యక్షుడు రామసహాయం శ్రీధర్ రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

యూరియా కోసం దాడి చేసుకున్న మహిళలు


దాడిని అడ్డుకుంటున్న పోలీసులు

బయ్యారం: వరుస క్రమంలో ఉన్న ఆధార్ జిరాక్స్‌లను మార్చిందని ఓ మహిళా రైతుపై తోటి మహిళా రైతులు సిగపట్టి దాడికి యత్నించిన సంఘటన శనివారం బయ్యారంలో చోటు చేసుకుంది. సొసైటీకి వచ్చిన యూరియా బస్తాలకు కూపన్లు పంపిణీ చేసేందుకు కోదండరామచంద్రస్వామి ఫంక్షన్ హాల్‌లో రైతులను కూర్చోపెట్టి ఆధార్ జిరాక్స్ సీరియల్ ఆధారంగా ఎస్సై తిరుపతి గ్రామాల వారీగా పేర్లు పిలుస్తున్నారు. ఈ క్రమంలో ఇర్సులాపురం పంచాయతీకి చెందిన ఓ మహిళ తమ పంచాయతీ పేర్లు రావటం లేదని ఆగ్రహంతో ఆధార్ జిరాక్స్‌లను చిందరవందర చేసింది. దీంతో కూపన్ల పంపిణీని నిలిపివేసి అధికారులు వెళ్లిపోయే ప్రయత్నం చేశారు. దీంతో ఆధార్ జిరాక్స్‌లను చిందరవందర చేసిన మహిళా రైతుపై మిగతా మహిళా రైతులు దాడికి యత్నించారు. వెంటనే పోలీసులు జోక్యం చేసుకొని వివాదంను ముగించారు.